క్రీడలకు సర్వం సిద్ధం



మేడారంలోని క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అధికారులు, పీడీలు



సిద్ధమవుతున్న కోర్టు

- నేటి నుంచి గిరిజన విద్యార్థులకు ఆటల పోటీలు
- ములుగు, భూపాలపల్లి పరిధిలో డివిజన్ల వారీగా క్రీడలు
- మైదానాలను సిద్ధం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: గిరిజన విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుకుంటున్న బాల బాలికల గిరిజన క్రీడాకారులకు క్రీడోత్సవాలను నేడు, రేపు నిర్వహించనున్నారు. ఇందు కోసం ములుగు, భూపాలపల్లి జిల్లాలోని మండలాలను డివిజన్‌గా విభజించి డివిజన్ స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నారు. ఈ డివిజన్ స్థాయి క్రీడల్లో గెలుపొంది ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్ స్థాయి అనగా ఆరు జిల్లాలకు ఒక టీంను పంపుతారు. ఇలా రెండు రోజుల పాటు జరిగే క్రీడోత్సవాలకు ఆయా క్రీడాలు ఆడించే క్రీడా మైదానాలను చదును, శుభ్రం చేశారు.

డివిజన్ స్థాయిలో సెక్రటరీల నియామకం

ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డివిజన్ స్థాయి సెక్రటరీగా ప్రధానోపాధ్యాయులను, ఆర్గనైజింగ్‌గా సెక్రటరీగా పీడీలను నియమించారు. భూపాలపల్లి డివిజన్ –1లో భూపాలపల్లి, కాటారం, మహాదేవ్‌పూర్, మల్హర్‌రావు, పలిమెలకు పీజీహెచ్‌ఎం సెక్రటరీగా రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీడీ వీరన్నను నియమించగా ఈ క్రీడలను భూపాలపల్లిలో నిర్వహిస్తారు. అలాగే ములుగు డివిజన్ –2 లో ములుగు, గోవిందరావుపేట, వెంకటాపురం(ఎం), తాడ్వాయిలకు హెచ్‌ఎం కల్తి శ్రీనివాస్, పీడీ గడ్డం లక్ష్మీనారాయణను నియమించి ఈ క్రీడలను మేడారం ఇంగ్లీష్ మీడియంలో నిర్వహిస్తారు. ములుగు డివిజన్ 3లో వాజేడు, వెంకటాపురం(కె)లకు చెందిన విద్యార్థులు పేరూరు క్రీడా మైదానంలో క్రీడలను నిర్వహించేందుకు పీజీహెచ్‌ఎం జోగయ్య, పీడీ నాగేంద్ర బాబులను నియమించారు. ములుగు డివిజన్ 4లో ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట క్రీడలను చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్నారు. అలాగే సెక్రటరీగా వాసం సారంగపాణి, పీడీ వెంకటేష్‌లను నియమించారు.

అండర్–14, 17 విభాగాలకు క్రీడలు

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలల్లో చదువుకుంటున్న బాల బాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారమ్స్, అర్చరీ, టెన్నికాయిట్, 100 మీటర్స్, 200, 400, 800, 1500, 3000 పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నారు. అలాగే 4 ఇంటు 400 రిలే, 4 ఇంటు 100 రిలే, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్ వంటీ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో గెలుపొంది ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్ స్థాయి క్రీడలకు పంపిస్తారు. ఆరు జిల్లాలను కలిపి ఒక జోనల్ స్థాయిలో పోటీలను నిర్వహిస్తారు.

క్రీడా మైదానాలు చదును



ములుగు, భూపాలపల్లి పరిధిలో నాలుగు డివిజన్‌లలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించనున్నాం. ఇందు కోసం క్రీడా మైదానంను చదును చేయించాం. ఇంకా కోర్టుల ఏర్పాటు, సామాగ్రి అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇన్‌చార్జ్‌లను కోఆర్డినేషన్ చేస్తూ సమర్థవంతంగా నిర్వహించనున్నాం.

– ఆదినారాయణ, ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి, ఏటూరునాగారం

'ఆరు గ్యారంటీలు' అమలు చేస్తాం..



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మదనపల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పార్టీ కార్యకర్తల, నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నూనేటి శ్యాం, తాళ్ల లక్ష్మీ-నర్సయ్య, బదర్‌జీ, పోరిక మధు, నారాయణసింగ్, సాగర్, రాజన్న గౌడ్, యాదగిరి, సత్యం, రాజన్న, మంజు నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

వాజేడు: యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, చదువుపై దృష్టిని కేంద్రీకరించాలన్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు, అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇతర శాఖలకు చెందిన సమస్యలు ఉన్న పోలీస్ వారిని సంప్రదిస్తే ఆయా శాఖల సమన్వయంతో సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. గుడుంబా తయారు చేసినా, వేరే గ్రామాల నుంచి తెచ్చి విక్రయించినా చట్టపరంగా చర్యలను తీసుకుంటామన్నారు. అనంతరం మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సదస్సును నేడు(బుధవారం) వాజేడు మండల కేంద్రంలో నిర్వహించ నన్నట్లు వెంకటాపురం ట్రాన్స్ కో ఏఈ సునీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన మీటర్లు మార్చడం, ఓల్టేజ్ హెచ్చు, తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన మీటర్ల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరించుట, సర్వీసు పేరు మార్చుట, వాడకంలో హెచ్చి మొత్తంలో గల బిల్లుల చర్చ, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు లాంటి సమస్యలు ఉన్న విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

బీజేపీలో చేరిక



ములుగు రూరల్: ములుగు జిల్లాలోని పలువురు మహిళలు బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే అంసెబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిరికొండ బలరాం, దొంతి వాసుదేవరెడ్డి, రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబరావు, మహేందర్, ప్రమోద్‌రెడ్డి, రాజ్‌కుమార్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది, వెంకటాపురం మండలవాసి పిట్టా శ్రీనివాస రెడ్డి బుధువారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మేడారం పర్యటనకు వచ్చిన ఆయనను కలిసి జిల్లాలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మంజూరు చేయటంపై కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



గణపురం: మండలకేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కోయిలా అంబేడ్కర్(20) పెంద్యాల వెంకటేష్(20)లు బీజాపూర్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తీసుకచ్చి ఇక్కడ విక్రయిస్తున్న క్రమంలో పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద 200గ్రా గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారిని తహసీల్దార్ సతీష్‌కుమార్ వద్ద బైండోవర్ చేసినట్లు వివరించారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే 87126 58122 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత



మహాముత్తారం: మండలకేంద్రానికి చెందిన దుర్గం దుర్గమ్మ కిడ్నీకి సంబంధించిన వ్యాధితో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.లక్ష 50వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. కాగా ఆ పత్రాన్ని శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహయకుడు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు.

బ్యాంకు సేవలపై అవగాహన



మహదేవపూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మపూర్ గ్రామంలో బ్యాంకు అందిస్తున్న సేవలపై కళాజాత బృందంతో బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, కళాజాత బృందం సభ్యులు, మెజీషియాన్ చిరంజీవి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మహాముత్తారం: మండల కేంద్రంతో పాటు యామన్‌పల్లి తదితర గ్రామాల్లో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరైన నగదు, వస్తువులను తరలించాలనుకుంటే వాటికి సంబంధించిన కాగితాలు ఉండాలని ఎస్సై సుధాకర్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మంగపేట: మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు 5వ షెడ్యూల్డు ఏరియా పరిధిలోకి వస్తాయని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ప్రభుత్వం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగపేట మండలం ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ అనే వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో 2011 నుంచి ఇప్పటి వరకు స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయిన విషయం తెలిసిందేనన్నారు. గిరిజన, గిరిజనేతరుల మధ్య నెలకొన్న వివాదంపై 2023 జెలై 05న హైకోర్టు మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు 5వ షెడ్యూల్డు ఏరియా పరిధిలోకే వస్తాయని తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ స్టే పేరుతో మండల అభివృద్ధిని అడ్డుకోవడం జరుగుతందని ఆరోపించారు. గిరిజనేతరుల స్టే పిటీషన్‌పై సుప్రీకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వానికి గిరిజనులపై ఏమాత్రం అభిమానం, ఆదివాసీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మండలంలో నిచిలిపోయిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోరం నాగేష్, ఎలగొండ రవివర్మ, పొదెం ప్రశాంత్, తోలెం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టల్ సేవలను వివరిస్తున్న సుచేందర్

వెంకటాపురం(కె): పోస్టల్‌లో పొదుపు, బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం పోస్టల్ శాఖ ఏఎస్పీ సుచేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ఆవరణంలో పోస్టల్ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతా 250 రూపాయలతో ప్రారంభించవచ్చునని, రూ.లక్ష యభైవేల మించకుండా పొదుపు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఓ దుర్గ ప్రసాద్, వెంకటాపురం పోస్టు మాస్టర్ నారాయణ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



నివాళులర్పిస్తున్న బడే నాగజ్యోతి

ఎస్‌ఎస్ తాడ్వాయి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో బుధవారం మృతి చెందిన సిద్దబోయిన సమ్మక్క కుటుంబాన్ని నాగజ్యోతి పరామర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తాడ్వాయి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన ఇర్ప సదానందం కుటుంబాన్ని పరామర్శించారు. తాడ్వాయిలోని ఎస్టీ కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ బంగారు సూర్యనారాయణ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పులసం పురుషోత్తం, తాడ్వాయి ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, పిరీళ్ల నరేష్, నాయకులు బండారు చంద్రయ్య, సిద్దబోయిన వసంతరావు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు



కొనసాగుతున్న తాత్కాలిక వంతెన పనులు

టేకుమట్ల: రాఘవరెడ్డిపేట–టేకుమట్ల మధ్య గల చలివాగు వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాల వరదలకు కూలిపోవడంతో మండల కేంద్రానికి వాగవతలి గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభించింది. దీంతో వాగవతలి గ్రామాల ప్రజలు మొగుళ్లపల్లి నుంచి చిట్యాల మీదుగా టేకుమట్ల మండల కేంద్రానికి సుమారు 20కిలో మీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది. ప్రయాణ భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు మండల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కలిసి రవాణా సౌకర్యార్థం తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టాలని కోరగా కలెక్టర్ చొరవతో సింగరేణి నిధులతో తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని నిర్మిస్తున్నారు. దసరా పండగ సీజన్‌లో మండల కేంద్రానికి వందలాది మంది ప్రజలు నిత్యావసర సరుకుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేందుకు వీలుగా మరో వారం రోజుల్లో వంతెన పనులు పూర్తి చేసి, రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి వస్తుందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం



మంగపేట: పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



వాజేడు: మాట్లాడుతున్న ముత్తమ్మ



బహుమతులు అందజేస్తున్న ప్రేమలత

ఏటూరునాగారం: మండల పరిధిలోని ఆకులవారి ఘనపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీమ్ అవర్ జనరేషన్ డిజిటల్ జనరేషన్ అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ప్రేమలత, ప్రొటక్షన్ అధికారి కృష్ణవేణి చైల్డ్ టీమ్ సభ్యులు రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు శ్రీలత తదితరులు ఉన్నారు.

జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలి

మంగపేట: బాలికలు శారీరక ఎదుగుదలను అర్థం చేసుకుని భావోద్వేగాలను అదుపులో ఉంచుకుని జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడానికి జీవన నైపుణ్యం అలవర్చుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం మండల ఇన్‌చార్జ్ రాజు అన్నారు. మండలంలోని చుంచుపల్లి కేజీబీవి, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ మల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ తెల్లం విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. బాల్య వివాహలు వాటి వలన కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాజేడు: బాలికలపై ప్రతి ఒక్కరూ గౌరవ భావం కలిగి ఉండాలని వెంకటాపురం(కె) ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని ముత్తమ్మ అన్నారు. మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని ముత్తమ్మ, చైల్డ్ కెర్ సంధ్య, డీసీపీయూ సోషల్ వర్కర్ సుమన్ మాట్లాడుతూ.. బాల్య వివాహల చట్టం, బాల కార్మిక చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. బాలికలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలిపారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహల నిర్మూళన, బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ ముత్తమ్మ, చైల్డ్ ప్రొటక్షన్ అధికారి హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, సూపర్‌వైజర్లు పుష్పవతి, చంద్రకళ తదితరులు ఉన్నారు.

నియామకం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగులు గ్రామానికి చెందిన గారె శంకర్‌ను కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడిగా ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాలతో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు దండు రమేష్, నియోజకవర్గం అధ్యక్షుడు సత్యం నియమించారు. ఈ మేరకు నియమకపత్రాన్ని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు, ఎస్సీసెల్ మండల ప్రధానకార్యదర్శి చేకూర్తి శంకరయ్యలు బుధవారం అందజేశారు. వారి వెంట నాయకులు కోరాల సురేందర్, మచ్చ కిష్టయ్య, వడ్లకొండ సమ్మయ్య, మానెం మహేష్, సంతోష్, బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జీఎంఆర్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతమ్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ మండల నాయకులు రూ.3000ల ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ నల్లబెల్లి రవీందర్, పెర్కారి నర్సింగరావు, ఎండీ అక్రం, సమ్మయ్య, శ్రీనివాస్, నరేష్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



కాటారం: పార్టీలో చేరిన వారితో శ్రీధర్‌బాబు

టేకుమట్ల(రేగొండ): కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. రేగొండ మండలంలోని భాగిర్తిపేట, జూబ్లీనగర్, దమ్మన్నపేట గ్రామాలకు చెందిన బీఎస్పీ, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సత్యనారాయణరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రజా శ్రేయస్సు కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నారు.

కాటారం: కాటారం ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు ఎలుబాక సుజాతతో పాటు పలు వార్డుసభ్యులు, నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టమధు వైఖరి నచ్చకపోవడంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మంథనిలో ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కాటారం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గోనె శ్రీనివాస్, మాచర్ల శ్రీజ రాజేందర్, నాయకులు కామిడి శ్రీనివాస్, చిలువేరు మహేశ్, సింగిరెడ్డి మధుకర్, నాయిని పవన్, నాయిని కల్యాణ్, నందకిశోర్, సంతోష్‌తో పాటు సుమారు 20 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, చీమల రాజు, అంగోతు సుగుణ, కుంభం స్వప్న తదితరులు ఉన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత



ఆస్రిప్ మృతదేహం

ములుగు రూరల్: ములుగు మండలం అబ్బాపూర్ శివారు బాణాలపల్లిలో లారీ అదుపుతప్పి కాలువలో పడిన ఘటనలో ఆస్రిప్ కోసం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమయింది. మైనింగ్ క్వారీకి హనుమకొండ జిల్లా ఆత్మకూర్ కు చెందిన డ్రైవర్ సాదిక్‌పాషా, కుమారుడు ఆస్రిప్‌లు ఏపీ 24 టీబీ 0514 నంబర్ గల లారీ మట్టితరలించేందుకు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో లారీ అదపు తప్పి పక్కన ఉన్న కాలువలోకి లారీ పడిపోయింది. ఈ ఘటనలో తండ్రి సాదిక్ పాషా (45) మృతదేహం మంగళవారం లభ్యం కాగా, ఆస్రిప్ (16) కోసం పోలీసులు ఈత గాల్లతో గాలింపు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమయినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.